## పెద్ది పవర్‌ఫుల్ మూమెంట్



అగ్రహీరో రామ్‌చరణ్ నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'పెద్ది'. 'ఉప్పెన'ఫేం బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ప్రస్తుతం భారీ యాక్షన్ నైట్ సీక్వెన్స్‌ను షూట్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఈ సినిమా డీవోపీ రత్నవేలు 'పెద్ది' సెట్స్ నుంచి పవర్‌ఫుల్ మూమెంట్‌ను షేర్ చేశారు. గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్‌తో భారీ నైట్ యాక్షన్ సీక్వెన్స్‌ని చిత్రీకరిస్తున్నట్టు సోషల్ మీడియాలోని తన వ్యక్తిగత ఖాతా ద్వారా ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన షేర్ చేసిన స్టిల్‌లో రామ్‌చరణ్ ఇంటెన్స్, అండ్ బీస్ట్ మోడ్‌లో కనిపిస్తున్నారు. ప్రస్తుతం ఈ స్టిల్ ఓ రేంజ్‌లో వైరల్ అవుతున్నది. వచ్చే ఏడాది మార్చి 27న సినిమా విడుదల కానుంది. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందుశర్మ కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: ఏ.ఆర్.రెహ్మాన్, సమర్పణ: మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్, నిర్మాణం: వృద్ధి సినిమాస్.



## నాగార్జున నిర్ణయం నాలో స్ఫూర్తిని నింపింది

'నటుడిగా పరిధిని పెంచుకోవాలని రొటీన్‌కి భిన్నంగా నాగార్జున చేసిన ఈ ప్రయత్నం నాకు స్ఫూర్తినిచ్చింది. ఈ సినిమా తర్వాత నిజంగా ఆయన కోసం పాత్రలు పుడతాయ్. ఈ విషయంలో నాక్కూడా ప్రేరణగా నిలిచారాయన. ధనుష్ నిజంగా పాత్రలో పరకాయ ప్రవేశం చేశారు. ఈ పాత్రను ఆయన తప్ప మరొకరు చేయలేరు. ఈ సినిమాతో తప్పకుండా ధనుష్‌కు నేషనల్ అవార్డు రావాలి. శేఖర్ కమ్ముల తీసిన సినిమాలు తక్కువే అయినా.. అన్నీ ఆణిముత్యాలే. ఆయన సినిమాల్లో ఆర్టిస్టులు కనిపించరు. పాత్రలే కనిపిస్తాయి. ఈ సినిమాలో కూడా అదే జరిగింది. ఈ సినిమా మరింత విజయాన్ని సాధించి, నిర్మాతలకు లాభాలు తెచ్చిపెట్టాలి' అని చిరంజీవి ఆకాంక్షించారు. ధనుష్ హీరోగా, అక్కినేని నాగార్జున ప్రత్యేక పాత్రలో రూపొందిన పాన్ ఇండియా చిత్రం 'కుబేర'. రష్మిక మందన్నా కథానాయిక. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, రామ్‌మోహన్ పుస్కూర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన బ్లాక్‌బస్టర్ ఈవెంట్‌లో చిరంజీవి మాట్లాడారు. 'థ్రిల్లర్ తీసి సోషల్ మెసేజ్ ఇవ్వడం శేఖర్ కమ్ములకే చెల్లింది. నటుడిగా నాలో మార్పు తెచ్చిందీ సినిమా. ఇక వెరైటీ పాత్రలు నన్ను వెతుక్కుంటూ వస్తాయి. ఇంకో 40ఏండ్లు నటుడిగా కొనసాగే స్ఫూర్తినిచ్చిందీ సినిమా. ఇక ధనుష్ నటన గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఓ సినిమా అందరికీ నచ్చడం అరుదు. అందుకే 'కుబేర' ఓ మిరాకిల్.' అని అక్కినేని నాగార్జున పేర్కొన్నారు. ధనుష్ మాట్లాడుతూ 'భారీతనం కాదు.. భావోద్వేగాలే ఆడియన్స్‌ని థియేటర్లకు రప్పిస్తాయని నిరూపించిన సినిమా 'కుబేర'.' అన్నారు. 'ఎంతో కష్టపడి ఈ సినిమా చేశాను. ఫస్ట్ షోతోనే ఆ కష్టాన్నంత మరిచిపోయేంత ఆనందాన్ని ఆడియన్స్ నాకిచ్చారు.' అని శేఖర్‌కమ్ముల సంతోషం వెలిబుచ్చారు. ఇంకా చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు.

## జన నాయకుడి హృదయంలో..



తమిళ అగ్ర నటుడు విజయ్ కథానాయకుడిగా రూపొందుతున్న పాన్ ఇండియా పొలిటికల్ థ్రిల్లర్ 'జన నాయకుడు'. తమిళ రాజకీయాల్లో విజయ్ బిజీ అయిన నేపథ్యంలో.. ఆయన చివరి సినిమాగా 'జన నాయకుడు' రానున్నది. హెచ్.వినోద్ దర్శకుడు. వెంకట్ కె.నారాయణ నిర్మాత. వచ్చే ఏడాది జనవరి 9న ప్రపంచ వ్యాప్తంగా సినిమా విడుదల కానుంది. ఆదివారం విజయ్ పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్ గ్లింప్స్‌ని, ఓ స్పెషల్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. 65 సెకన్స్ నిడివి ఉన్న ఈ గ్లింప్స్‌ని గమనిస్తే.. 'నా హృదయంలో ఉండే..' అంటూ సాగే విజయ్ మాటలతో ఈ గ్లింప్స్ మొదలైంది. పోలీస్ డ్రెస్‌లో లాఠీ పట్టుకుని యుద్ధ వాతావరణాన్ని తలపించే ప్రదేశంలో నడుస్తూ ఈ గ్లింప్స్‌లో కనిపించారు విజయ్. శక్తి, శాంతి, గంభీరత కలగలిపేలా ఉన్న ఈ గ్లింప్స్.. రాజకీయంగా విజయ్ లక్ష్యాలను ప్రతిబింబించేలా ఉంది. ఇక సింహాసనంపై ఠీవీగా కూర్చుని, చేతిలో కత్తితో ఇంటెన్స్ లుక్‌లో విజయ్ కనిపిస్తున్న పోస్టర్ సినిమాపై అంచనాలు పెంచేలా ఉంది. అనిరుద్ రవిచందర్ ఈ చిత్రానికి స్వరాలను అందిస్తున్న విషయం తెలిసిందే.

### పుట్టగానే బ్రహ్మ ముడి పెట్టరో..

## వయసు తాకి జంట కట్టెరో..



అనుష్కశెట్టి లీడ్ రోల్ చేస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'ఘాటి'. తమిళ నటుడు విక్రమ్ ప్రభు కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి దర్శకుడు. రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మాతలు. నిర్మాణం తుదిదశకు చేరుకున్న ఈ చిత్రం జూలై 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమాలోని తొలి సాంగ్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'పుట్టగానే బ్రహ్మ ముడి పెట్టరో.. వయసు తాకి జంట కట్టెరో.. బతుకునంత తోడులోన చూసెరో.. అడుగు అడుగు మొదలుపెట్టెరో..' అంటూ జానపద ధోరణిలో సాగిన ఈ పాటను కృష్ణ రాయగా, నాగవెల్లి విద్యాసాగర్ స్వరపరిచారు. లిప్సిక భాష్యం, సాగర్ నాగవెల్లి, సోనీ కోమండూరి ఆలపించారు. రాజు సుందరం నృత్య రీతుల్ని సమకూర్చారు. కొత్తగా పెళ్లైన హీరోహీరోయిన్ల నడుమ.. సాంస్కృతిక శోభతో ఓ సంబరంగా ఈ పాటను దర్శకుడు క్రిష్ చిత్రీకరించారు. ప్రకృతి సౌందర్యంతో నిండిన అడవుల నేపథ్యంలో ఈ ఫోక్ వెడ్డింగ్ యాంథమ్ ఉత్సవాన్ని తలపించింది. ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా, కెమెరా: మనోజ్‌రెడ్డి కటాసాని, ఆర్ట్: తోట తరణి, సమర్పణ: యూవీ క్రియేషన్స్, నిర్మాణం: ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్స్.

## డ్యూడ్‌లో కురళ్‌గా



లవ్‌టుడే, డ్రాగన్ చిత్రాల ఫేం ప్రదీప్ రంగనాథన్ కథానాయకుడిగా రూపొందుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'డ్యూడ్'. 'ప్రేమలు'ఫేం మమిత బైజూ కథానాయిక. కీర్తిశ్వరన్ దర్శకుడు. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. ఆదివారం కథానాయిక మమితా బైజు పుట్టినరోజు సందర్భంగా, ఆమెకు శుభాకాంక్షలు అందిస్తూ.. ఇందులో ఆమె పోషిస్తున్న 'కురళ్' పాత్రను పరిచయం చేస్తూ ఓ స్పెషల్ పోస్టర్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. బ్యూటీ అండ్ చార్మ్‌తో యువతను ఆకట్టుకునేలా ఈ పోస్టర్‌లో మమిత బైజు కనిపిస్తున్నారు. శరత్‌కుమార్, హృదు హరూన్, ద్రవిడ్ సెల్వం తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: నికేత్ బొమ్మి, సంగీతం: సాయి అభ్యంకర్.

## ప్రిన్స్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్



హీరో ప్రిన్స్, సుహానా ముద్వాన్ జంటగా ఓ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ రూపొందుతున్నది. సునైనా, నెల్లూరు సుదర్శన్ కీలక పాత్రధారులు. కుమార్ రవికంటి దర్శకుడు. కమార్ రవికంటి నిర్మాత. రీసెంట్‌గా ప్రముఖుల సమక్షంలో ఈ సినిమా పూజా కార్యక్రమాలు జరిగాయి. మహూర్తపు సన్నివేశానికి బేబీ దియ క్లాప్ కొట్టగా, సుమ రవికంటి కెమెరా స్విచాన్ చేశారు. థ్రిల్లింగ్ అంశాలతోపాటు హృదయాలను హత్తుకునే భావోద్వేగాలు కూడా ఈ కథలో ఉంటాయని, జూలై, ఆగస్ట్ నెలల్లో ఏకధాటిగా చిత్రీకరణ జరుపుతామని, విదేశాల్లో పాటలను చిత్రీకరిస్తామని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి మాటలు: భవాని ప్రసాద్, కెమెరా: జి.అమర్, నిర్మాణం: లైట్ స్టోర్మ్ సెల్యులాయిడ్స్.

## యుఫోరియా స్వరాలు



'అందరూ కనెక్ట్ అయ్యేలా చక్కని మెసేజ్‌తో ఈ సినిమా ఉంటుంది. ఇప్పటికే విడుదలైన 'ఫ్లై హై..' పాటతో అందర్నీ అలరించిన సంగీత దర్శకుడు కాలభైరవ.. ఇప్పుడు రెండో పాటతో వచ్చారు. 'రామ రామ..' అంటూ సాగే ఈ పాటను చైతన్యప్రసాద్ రాయగా, కాలభైరవ అద్భుతంగా స్వరపరిచారు. అందరూ ఎంజాయ్ చేసేలా ఈ పాట ఉంటుంది. ఈ సినిమా ద్వారా 20మంది కొత్తవాళ్లని పరిచయం చేస్తున్నాం. ఈ సినిమా ద్వారా కథానాయకుడిగా పరిచయం అవుతున్న విఘ్నేష్ గవిరెడ్డికి ఈ సినిమా మంచి బ్రేక్ అవుతుంది. భూమిక పాత్ర సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది.' అని డైరెక్టర్ గుణశేఖర్ అన్నారు. లేట్ నైట్ కల్చర్, డ్రగ్స్ యువతపై ఎలాంటి ప్రభావం చూపిస్తున్నాయో తెలిపే కథాంశంతో రూపొందుతున్న సందేశాత్మక యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'యుఫోరియా'. గుణశేఖర్ స్వీయ దర్శకత్వంలో రాగిణి, నీలిమలతో కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. ప్రమోషన్‌లో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో గుణశేఖర్ మాట్లాడారు. ఈ సినిమా ప్రజల్లో ఎంతో ఇంపాక్ట్ చూపిస్తుందని, తల్లిదండ్రులు తప్పకుండా చూడాల్సిన సినిమా ఇదని భూమిక పేర్కొన్నారు. ఇంకా ఎడిటర్ ప్రవీణ్‌పూడి, నిర్మాత నీలిమ గుణ, హీరో విఘ్నేష్ గవిరెడ్డి, రోహిత్ కూడా మాట్లాడారు.



## కత్తందుకో జానకీ..

ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ముఖ్యతారలుగా రూపొందుతున్న చిత్రం 'మిత్ర మండలి'. విజయేందర్.ఎస్ దర్శకుడు. కల్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా.విజయేందర్‌రెడ్డి తీగల నిర్మాతలు. ప్రస్తుతం సినిమా నిర్మాణ దశలో ఉంది. ప్రమోషన్‌లో భాగంగా ఏపీలోని అమలాపురం కిమ్స్ కాలేజ్‌లో ఏర్పాటు చేసిన గీతావిష్కరణ కార్యక్రమంలో ఈ సినిమాలోని తొలి గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. రెబల్‌స్టార్ కృష్ణంరాజు ఐకానిక్ డైలాగ్ అయిన 'కత్తందుకో జానకీ..'ని పల్లవిలోని తొలి పదంగా కాసర్ల శ్యామ్ రాసిన ఈ గీతాన్ని ఆర్.ఆర్.ధృవన్ స్వరపరిచారు. రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. ప్రధాన పాత్రధారుల ప్రపంచాన్ని పరిచయం చేస్తూ ఈ గీతం సాగింది. వీరి అలవాట్లను, రిలేషన్స్‌ని ప్రస్తావిస్తూ సాగిన ఈ గీతంలో తల్లిదండ్రులు వారిని తరుముతూ 'కత్తందుకో జానకి' అనడం ఈ పాటలో హైలైట్. అందర్నీ అలరించేలా, బాధల్నీ మరపించేలా, థియేటర్లలో హాయిగా నవ్వులు పూయించేలా ఈ సినిమా ఉంటుందని మేకర్స్ తెలిపారు. అమలాపురం ఎంపీ జి.ఎం.హరీష్ బాలయోగి అతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో చిత్రయూనిట్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ్ ఎస్.జె, సమర్పణ: బన్నీ వాస్, నిర్మాణం: సప్తఅశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్‌టైన్మెంట్స్.



## ప్రతిభామూర్తులకు పురస్కారాలు

విజన్ స్టూడియోస్ 11వ వార్షికోత్సవం సందర్భంగా సంస్థ అధినేతలు.. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన వ్యక్తులకు 'ఐకాన్స్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025' పేరిట పురస్కారాలను అందించారు. విజన్ స్టూడియోస్ వారు తొలిసారి నిర్వహించిన ఈ అవార్డ్స్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు సినీ, వ్యాపారరంగ ప్రముఖులు కూడా ఈ ఈవెంట్‌లో అతిథులుగా పాల్గొని విజన్ స్టూడియోస్ వారికి శుభాకాంక్షలు అందించారు. టీఎఫ్‌సీసీ ఛైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్, నిర్మాతలు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, సాయివెంకట్, నటి దివ్యవాణి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## లోపలికి రా చెప్తా..



కొండా వెంకట రాజేంద్ర హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన హారర్ కామెడీ మూవీ 'లోపలికి రా చెప్తా'. మనిషా జష్నాని, సుస్మిత అనాలా, సాంచిరాయ్ ప్రధాన పాత్రధారులు. లక్ష్మీగణేష్ చేదెళ్ల, కొండ వెంకట రాజేంద్ర నిర్మాతలు. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ చిత్రం జూలై 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ని నిర్వహించారు. ప్రముఖ రచయిత విజేంద్రప్రసాద్ ట్రైలర్‌ని విడుదల చేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. స్క్రీన్‌ప్లేలో తనకున్న పదేళ్ల అనుభవంతో ఈ చిత్రాన్ని రూపొందించానని, ఈ స్క్రిప్ట్‌లో నాలుగైదు జానర్లు ఉంటాయని, హారర్ కామెడీతో పాటు యువతకు కావాల్సిన అంశాలు కూడా ఇందులో ఉంటాయని దర్శక, నిర్మాత కొండా వెంకట రాజేంద్ర తెలిపారు. దర్శకులు కొండ విజయ్‌కుమార్ నటులు శుభలేఖ సుధాకర్, రమేష్, ప్రవీణ్ కటారి, గీత రచయిత అలరాజు కూడా మాట్లాడారు.

### వినోదభరితంగా

## సః కుటుంబానాం



రామ్ కిరణ్, మేఘా ఆకాష్ జంటగా నటిస్తున్న చిత్రం 'సః కుటుంబానాం'. డా.రాజేంద్రప్రసాద్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి ఉదయ్‌శర్మ దర్శకుడు. హెచ్.మహాదేవ్ గౌడ్ నిర్మాత. నిర్మాణం తుది దశకు చేరుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఈ సినిమా టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఫ్యామిలీమ్యాన్ అనిపించుకుంటున్న కథానాయకుడు.. ఫ్యామిలీని హేట్ చేస్తూ ఈ టీజర్‌లో కనిపిస్తున్నాడు. కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా ఇదని టీజర్ చెబుతున్నది. మణిశర్మ సంగీతం ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. బ్రహ్మానందం, సత్య, శుభలేఖ సుధాకర్, రాజశ్రీ నాయర్, రచ్చ రవి, గిరిధర్, తాగుబోతు రమేష్, భద్రం తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మధు దాసరి.

## దుబాయ్‌లో గామా హంగామా..



ప్రతిష్టాత్మక GAMA – 2025 (Gulf Academy Movie Awards) వేడుకకు దుబాయ్‌లోని షార్జా ఎక్స్‌పో సెంటర్ వేదిక కానుంది. దుబాయ్‌లో నాలుగేళ్లుగా, ప్రతి ఏడాదీ వైభవంగా ఈ అవార్డుల వేడుక జరిగిన నేపథ్యంలో.. ఆగస్ట్ 30న జరుగనున్న ఈ అయిదవ ఎడిషన్, తొలి నాలుగు ఎడిషన్స్‌ని మించి అత్యంత వైభవంగా జరుపనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఓ థీమ్ సాంగ్‌ను శనివారం దుబాయ్‌లో లాంచ్ చేశారు. గీతరచయిత చంద్రబోస్ రాసిన ఈ పాటను రఘు కుంచె స్వరపరచి ఆలపించారు. ఆగస్ట్ 30న టాలీవుడ్ అవార్డ్స్‌తో పాటు, ఆగస్ట్ 29న ఎక్సలెన్స్ అవార్డుల వేడుకను కూడా నిర్వహించేలా భారీగా సన్నాహాలు జరుగుతున్నాయి. హీరోలు సిద్ధు జొన్నలగడ్డ, తేజ సజ్జా, కిరణ్ అబ్బవరం, శ్రీవిష్ణు, రోషన్, మీనాక్షి చౌదరి, దక్ష నగార్కర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు.



## అలరించిన యోగా ఆంథెమ్..

అగ్ర సంగీత దర్శకుడు మణిశర్మ కంపోజిషన్‌లో, అనంత శ్రీరామ్ సాహిత్యాన్ని అందించగా, ఇషాన్ క్రియేషన్స్ సంస్థ నిర్మించిన యోగా ఆంథెమ్ సాంగ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ దర్శకులు మారుతి విడుదల చేసి, మేకర్స్‌కి శుభాకాంక్షలు అందించారు. గీత రచయిత అనంత శ్రీరామ్ మాట్లాడుతూ 'మనసుని, శరీరాన్ని కలిపే శక్తి యోగాకు మాత్రమే ఉంది. ఏ పేటెంట్ లేకుండా ప్రపంచానికి మన దేశం అందించిన కానుక యోగా. అన్ని భాషలవారికీ అర్థం కావాలనే ఉద్దేశ్యంతోనే దైవభాష అయిన సంస్కృతాన్ని ఈ పాటలో ఎక్కువగా వాడాను.' అని తెలిపారు. ఈ ఏడాది నిర్వహించిన యోగాంధ్ర సెలబ్రేషన్స్‌లో ఈ పాటకు ఫస్ట్ ప్రైజ్ వచ్చిందని, ఈ పాటకు అన్నీ అద్భుతంగా కుదిరాయని ఇషాన్ క్రియేషన్స్ అధినేత అశోక్ పేర్కొన్నారు.